కష్టాల ఖరీఫ్

- కరుణించని ప్రకృతి.. పట్టించుకోని ప్రభుత్వం
- దళారుల ఇష్టారాజ్యం.. కొనుగోళ్లు అంతంతమాత్రం

ఆకివీడు: కన్నీటితో వరి సాగు.. అవును నిజంగానే ఖరీఫ్ సాగు రైతులు కన్నీటితో సాగు చేశారు. గుప్పెడు మెతుకుల కోసం ఆరుగాలం కష్టపడిన అన్నదాత ఆర్థికంగా కుంగిపోతున్నాడు. ప్రకృతి కరుణించడం లేదు. ప్రభుత్వం కనికరించడం లేదు. దీంతో అయోమయంలో అన్నదాతలు ఉన్నారు. నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 50 శాతం వరి పంట వరదలు, భారీ వర్షాలకు పూర్తిగా నాశనమైపోయింది. మిగిలిన ఉండి, పాలకోడేరు, కాళ్ల మండలాల్లో కొద్దిపాటి నష్టం వాటిల్లింది. నియోజకవర్గంలో 27,949 ఎకరాల్లో వరి పంట మిగిలి ఉంది. తుఫాన్‌కు ముందు, తరువాత నియోజకవర్గంలో 6,800 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. 17,843 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు చేర వేశారు. ప్రస్తుత ఫెంగల్ తుఫాన్‌కు మళ్లీ భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది.

భీమవరం నియోజకవర్గంలో 15, 200 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. ఇప్పటికే ఏడు వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. రైతుల వద్ద నుంచి సుమారు 11,531 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తేమ శాతం అధికంగా ఉందని రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి రాశుల్లో మరో 10 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉందని చెబుతున్నారు.

తప్పని దళారుల బెడద

రైతులు ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకుని గింజ గింజా ఒడిసి పట్టినా దళారుల పాలు కాకతప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు దళారులను ఆశ్రయించాల్సి వచ్చిందంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేయకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం దళారులు, కమిషన్‌దారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చి సాగు చేశామంటున్నారు. పెట్టుబడులు పెట్టిన దళారులు రైతులు పండిన పంటను వారికి ఇష్టం వచ్చిన రైస్‌మిల్లుల్లో దిగుమతి చేస్తున్నారు. కొన్ని చోట్ల రైతులు పండించిన పంటలో కొన్ని బస్తాలు రైతుల పేర జమ చేసి, మరి కొన్ని బస్తాలు వారికి అనువైన రైతుల పేర జమ చేసి సొమ్ము రాబట్టుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భీమవరం, ఉండి, పాలకోడేరు మండలాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉందని చెబుతున్నారు. అదే విధంగా తణుకు, అత్తిలి, దువ్వ తదితర ప్రాంతాల నుంచి కమీషన్‌దారులు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఆకివీడు పరిసర ప్రాంతాల్లో రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు.

దాళ్వాకైనా దక్కేనా భరోసా

ఖరీఫ్ సాగుకు అందని రైతు భరోసా పథకం సొమ్ము దాళ్వా నాటికై నా మంజూరు చేస్తారన్న ఆశల్లో అన్నదాతలున్నారు. అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేస్తే, పండిన పంటను అప్పులు తీర్చడానికి కూడా సరిపోదంటున్నారు. ఈ పరిస్థితుల్లో దాళ్వా పెట్టుబడులపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైస్ మిల్లుకు చేరవేసేందుకు లారీలోకి ఎగుమతి చేస్తున్న ధాన్యం బస్తాలు

క్లుప్తంగా

ప్లాస్టిక్ వినియోగంపై హెచ్చరిక

ఆకివీడు: ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగంపై స్థానిక ఇన్‌చార్జి శానిటరీ అధికారి టి.సాకేత్ పలు హోటళ్ల యజమానులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలను ఆయన సందర్శించి పరిశీలించారు. యాజమానులతో మాట్లాడుతూ తినుబండారాలు తయారు చేసే ప్రాంతాల్లో అపారిశుద్ధ్యం, ఈగలు, బొద్దింకలు వంటివి తిరగకుండా చూడాలని హెచ్చరించారు. వంట గదులను పరిశీలించి పరిశుభ్రతపై హెచ్చరించారు. అధిక మైక్రాన్ కవర్లను వాడకూడదని, వ్యర్థాలను పారవేయకుండా ప్రతి రోజూ చెత్త ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యూనియన్ బ్యాంకు ప్రతినిధులు



మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమవరం: భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజినల్ హెడ్ పి సంగీత కుమారి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మహిళలకు కావలసిన మద్దతు, వనరులు, నమ్మకాన్ని ఇవ్వడం ద్వారా శక్తివంతులుగా తయారు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ ఎం వెంకన్నబాబు, బ్యాంక్ అధికారులు సంతోష్, ఉదయలక్ష్మి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి సేవలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి



సోమేశ్వరస్వామివారి దర్శించుకున్న పీ.ఎస్.ప్రద్యుమ్న, కుటుంబ సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామిని ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పీ.ఎస్.ప్రద్యుమ్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



కార్తీక పోలిపాడ్యమి కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆకివీడు: కార్తీకమాసం ముగిసిన మరుసటిరోజు పోలి పాడ్యమి కార్తీక దీపం చెంత భక్తి శ్రద్ధలతో సోమవారం దీపాలు వెలిగించి చెరువులు, కాలువల్లో వదిలారు. తొలుత శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరీ సహిత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు దీపాలు వెలగించారు.

రామారావును పరామర్శించిన శాసనమండలి చైర్మన్



రమేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కొప్పర్తి రామారావును శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సోమవారం పరామర్శించారు. రామారావు కుమారుడు రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండమని మేమంతా అండగా ఉన్నామని రామారావుకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, మాజీ ఎంపీటీసీ పెనుమల నరసింహస్వామి, మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు తదితరులు ఉన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

యలమంచిలి: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండారు రామమోహన్ రావు సోమవారం యలమంచిలి మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుర నరసింహమూర్తి, రంకిరెడ్డి శ్రీనివాస్, సంకీర్త్, సంతోష్ పాల్గొన్నారు.

4 నుంచి ఎస్ఆర్‌కేఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 4, 5, 6 తేదీల్లో అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఐసిఏఏఐ ఐ-2024) పేరిట అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సీఎస్ఈ హెడ్, సదస్సు జనరల్ చైర్స్ బీహెచ్ వీఎస్ రామకృష్ణంరాజు, వి చంద్రశేఖర్ చెప్పారు. అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన వివరాలను సోమవారం విలేకర్లకు వివరించారు. ఈ సదస్సుకు ప్రత్యేకంగా మలేషియా నుంచి డాక్టర్ జరీనా మహమ్మద్ అనాపి, దుబాయ్ నుంచి రోబోటిక్ఎక్స్ ల్యాబ్ వ్యవస్థాపకుడు జూది ప్రస్టియో, అమెరికాలోని వరాకిల్ కార్పొరేట్‌కు చెందిన డాక్టర్ బుధరాజు రాజారావు, టెక్సాస్ నుంచి ప్రకాష్ మురుగేషన్, ఐఐటి హైదరాబాద్ నుంచి ఎం వి పాండురంగారావు, ఎన్ఐటి రాయపూర్ నుంచి డాక్టర్ ప్రదీప్ సింగ్ ,ఎన్ఐటి వరంగల్ నుంచి డాక్టర్ కెవి కాదాంబరి వంటి ప్రముఖులు సదస్సులో పాల్గొంటారన్నారు. అంతర్జాతీయ సదస్సుకు విదేశాల నుంచే కాకుండా దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల నుంచి పలువురు నిపుణులు హాజరవుతున్నారని కార్యక్రమానికి ఆర్ఎస్‌వి జగన్మోహన్ కన్వీనర్, టీవీకెపి ప్రసాద్ కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

అంబరాన్నంటుతున్న క్రిస్మస్ సంబరాలు



విద్యుత్ వెలుగులతో వెలివర్రు సెయింట్ జాకబ్ లూథరన్ చర్చి



కాళ్ల: జక్కరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఉండి: ఈ ఏడాది క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఒకరికి మించి మరొకరు ఘనంగా నిర్వహించేందుకు పోటీ పడుతున్నారు. మండలంలోని వెలివర్రులో సెయింట్ జాకబ్ లూథరన్ చర్చ్ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చర్చిని అందమైన రంగురంగుల విద్యుత్ లైట్లతో నింపారు. దీంతో చర్చ్ వెలుగులతో గ్రామమంతా ఆహ్లాదకరంగా క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సంఘ కమిటీ ఆధ్వర్యంలో చర్చిలో నిర్వహిస్తున్న ఉదయకాల ఆరాధన ప్రార్థనా కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని ఏసుక్రీస్తును ఆరాధిస్తూ నెలరోజుల ముందుగా క్రిస్మస్ ఆనందాన్ని పొందుకుంటున్నారని చర్చి సీఆర్ పి.పదేశికుమార్ తెలిపారు. ఈ విధంగా మండలంలోని పలు గ్రామాల్లో భారీ స్టార్‌లు ఏర్పాటు చేస్తూ క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున సిద్ధపడుతున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఆకట్టుకున్న పశువుల పాక

కాళ్ల: ప్రపంచ మానవాళికి క్రిస్మస్ ప్రాముఖ్యమైన పండుగ అని పాస్టర్ జీడీ కరుణాకర్ తెలిపారు. కాళ్ల మండలం జక్కరం చినపేటలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువుల పాక, స్టార్ అందరినీ ఆకట్టుకుంది. సంఘ పెద్దలు సిరింగి ఇస్సాకు, బి.ఇస్సాకు, ఎస్.రవి, డి.మోషే పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న యూపీఏ అధ్యక్షుడు సాల్మన్‌రాజు

పాలకోడేరు: యూపీఏ మండల అధ్యక్షుడు గోపే సాల్మన్ రాజు అధ్యక్షతన యునైటెడ్ పాస్టర్స్ ఫ్యామిలీ ఐక్య క్రిస్టమస్ వేడుకలు మోగల్లులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వాక్యోపదేశకులు గాదిరాజు తిమోతిరాజు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ మన హృదయాలను శుద్ధి చేసుకుని క్రీస్తును ఆరాధించాలన్నారు. తొలుత ప్రార్థనలతో ప్రారంభించి గీతాలు, క్రీస్తు జనన నాటికలు, దేశ రాష్ట్రాల కోసం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు జేఎస్ రావు, జేఎస్ కుమార్ రాజేష్ రవిశంకర్ తబిత, టి.రమేష్‌అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం తెలిపారు. మండలంలోని పెదకాపవరం శివారు దండగర్ర గ్రామం నుంచి ఆలకోడు పుంత రోడ్డును విస్తరింపజేసి దండగర్ర కాలువపై వంతెన నిర్మించాలని ఆ ప్రాంత రైతులు ఫిర్యాదు చేశారన్నారు. పట్టణంలోని సాలిపేటలోని పెద్ద వీధి పలు చోట్ల ఆక్రమణలకు గురైందని రెండు పర్యాయాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని శలాకోట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ వివరించారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ఉండి: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహదేవపట్నం మధ్యపేటకు చెందిన పిల్లి ప్రశాంతి అనే మహిళపై అదే ప్రాంతానికి చెందిన విప్పర్తి యాకోబు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మానసిక వేధింపులకు గురి చేశాడు. గత నెల 8వ తేదీన యాకోబు ఆ మహిళపై లైంగిక వేధింపులకు దిగడంతో ఆమె అతనిని గట్టిగా నెట్టి వేసింది. ఇది గమనించిన అతని బావమరిది ముళ్లగిరి బాబూరావు ఆ మహిళను జుట్టు పట్టుకుని ఈడ్చడంతోపాటు ఆమెను అసభ్యంగా తిట్టాడు. స్థానికులు కొందరు కలగజేసుకుని గొడవ సద్దుమణిగించారు. అయితే సోమవారం మరోసారి మహిళను చంపుతానని బెదిరింపులకు దిగడంతో ఇద్దరిపై మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదుపై హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సమరసత సేవ ఫౌండేషన్ వార్షికోత్సవాలు



రామాలయంలో సమరసత వార్షికోత్సవంలో పాల్గొన్న సభ్యులు

వీరవాసరం: మండలంలో సమరసత సేవ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంస్థ 2015 డిసెంబర్ 2న తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో 65 మంది స్వామీజీలు, పీఠాధిపతులు, 18 మంది ఐఏఎస్ ఆఫీసర్లు కలిసి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సమాజంలో ఆధ్యాత్మిక, సేవా అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ముందుగా సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి చిన్న సన్యాసిరావు, పి నాగరాజు, నక్కెళ్ళ లక్ష్మి, దొడ్డి శ్రీనివాసరావు, కానూరి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలి

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 26 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యలపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు



పెదఅమిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: మండలంలోని పెదఅమిరంలోని అరుణోదయ మనోవికాస కేంద్రాన్ని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 41 మందికిగాను 36 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారిని పరీక్షించగా అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని కాని ఒక పాపకు కంటి లోపం ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. ఈ కేసును ఉన్నత అధికారులకు తెలియపరచనున్నట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వహకురాలు ఇందుకూరి అరుణాదేవి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల దినోత్సవం

ఉండి: ఎంపీడీవో కార్యాలయం ప్రక్కనే గల భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



భీమవరంలో విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య కృష్ణంరాజు

భీమవరం: ఇంటర్‌స్టేట్ కరాటే పోటీల్లో భీమవరం పట్టణంలోని ఆదిత్య స్కూల్ విద్యార్థి పి ధనుష్‌సోమలింగాచారి బంగారు పతకం సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు చెప్పారు. సోమవారం వివరాలను విలేకర్లకు తెలిపారు. వైజాగ్‌లో నిర్వహించిన శ్రీగంటా కనకారావు మెమోరియల్ ఇన్విటేషన్ ఇంటర్ స్టేట్ పోటీల్లో తమ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్న సోమలింగాచారి బంగారు పతకం గెల్చుకున్నాడన్నారు. అలాగే భీమవరంలోని త్యాగరాజ భవన్‌లో చిన్మయమిషన్ నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో తమ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న టి జయరామ్‌దత్త 3వ ర్యాంక్‌తో ప్రశంసాపత్రం అందుకున్నాడన్నారు. అనంతరం విద్యార్థులను కృష్ణంరాజు, స్కూల్ ప్రిన్సిపల్ టి శ్రీనివాస్, బి యుగసుధ, కేవీ సత్యనారాయణ అభినందించారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత



భీమవరంలో చినరంగనిపాలెం స్కూల్లో కాలుష్య నివారణపై ప్రచారం చేస్తున్న దృశ్యం

భీమవరం: కాలుష్యంతో అంతుపట్టని వ్యాధులు వస్తున్నాయని, కాలుష్య నివారణ ప్రజలందరి సామాజిక బాధ్యతని భీమవరం మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్లో సోమవారం శ్రీవిజ్ఞానవేదిక, ఏకో క్లబ్, పురపాలక సంఘం ఆధ్వర్యంలో జాతీయ వాతావరణ కాలుష్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భావితరాల భవిష్యత్ రక్షించుకోవాలంటే ప్రజలంతా కాలుష్య నివారణకు పాటు పడాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం కె వెంకటరావు మాట్లాడుతూ శబ్ధ, నీరు, వాయు కాలుష్యం ప్రాణాంతకాలుగా మారాయని ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థులతో కాలుష్య నియంత్రణ ప్రతిజ్ఞ, ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కె గోపినాథ్ తదిరులు పాల్గొన్నారు.

ఆలకోడుకు అనధికార అడ్డుకట్ట



పెదకాపవరంలోని ఆలకోడు డ్రెయిన్‌కు అడ్డుకట్టగా తూర వేసి పూడ్చివేసిన దృశ్యం

ఆకివీడు: మండలంలోని పెదకాపవరంలో ఆలకోడు డ్రెయిన్‌కు తూరలు వేసి, పూడ్చి వేసినట్లు రైతులు వాపోతున్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి నేరుగా ఆలకోడులోకి అదనపు నీటిని వదులుతుంటారు. మురుగు కాలువగా ఉన్న ఆలకోడు డ్రెయిన్ వెంబడి చెరువులు, పంట భూములు సుమారు మూడు వేల ఎకరాల పైబడి రైతులు ఈ కాలవ నీటిని వినియోగించుకుంటారు. కాలువకు అడ్డుకట్టగా వేసిన తూరల వంతెన వలన నీటి ప్రవాహం దిగువకు వెళ్లడం లేదని, ఎగువ ప్రాంత రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఎడమ వైపున ఉన్న రైతులు తన చెరువులోని మట్టిని బయటకు తోలుకునేందుకు కాలువకు అడ్డంగా తూరలు వేసి రోడ్డుగా మలిచినట్లు వారు పేర్కొన్నారు. దీనిపై డ్రైనేజీ శాఖ అధికాలకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా తూరల వంతెన పనులు చేపట్టినా ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో కాలువ వెంబడి చేపలు, రొయ్యల రైతులు ఇదే విధంగా అడ్డకట్ట వంతెనలు వేసే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. దీనిపై వీఆర్వో సుబ్బారావును వివరణ కోరగా ఆలకోడు డ్రెయిన్‌కు తూరలు వేసి అడ్డుకట్టగా ట్రాక్టర్లు వెళ్లేందుకు మార్గం వేశారని చెప్పారు. స్థానికంగా వచ్చిన ఫిర్యాదు మేరకు పనులను నిలుపుదల చేశామన్నారు. ఈ ఘటనపై మండల అధికారులకు తెలియజేశామన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేత మున్నా



భీమవరంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో కె-12 జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన షైక్ మున్నా విజేతగా నిలిచి రూ. 10 వేలు నగదు బహుమతి గెల్చుకున్నాడు. పోటీల వివరాలను సోమవారం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ కాశిమ్ విలేకర్లకు తెలిపారు. ఆదివారం ఈ పోటీల్లో 55 మంది బాడీ బిల్డింగ్ క్రీడాకారులు పాల్గొనగా మున్నా మొదటి స్థానంలో నిలవగా , వై ప్రణయ్ ద్వితీయ, ఎం రాజు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో కె తిలక్ ద్వితీయ, కొల్లాటి జగదీష్‌కుమార్ తృతీయ స్థానంలో గెలుపొందారని కాశిమ్ చెప్పారు. ఈ పోటీలకు సయ్యద్ సుభాని న్యాయనిర్ణేతగా వ్యవహరించగా బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కటారి రవిశంకర్, సీనియర్ బాడీ బిల్డర్ బొల్లా శ్రీనివాస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ చేతుల మీదుగా ట్రోఫిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసి వరప్రసాద్, పాపారావు, షేక్ ఖాజీ, ఆసిఫ్, చిట్టిబాబు, ఏసు, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్కూల్‌లో ఆటల పోటీలు

పాలకొల్లు అర్బన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని సబ్బేవారిపేట అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో రూరల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. 50, 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్, డిస్కస్ త్రో, పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు మూడో తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.జయభారత్‌రెడ్డి, అందే భాను ప్రకాష్, కోశాధికారి టీవీఆర్ సురేష్, అంజలి సంస్థ సెక్రటరీ వీడీవీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ఎంఏఎస్ ప్రత్యూష, కోఆర్డినేటర్స్ వీఎస్ఎస్ నారాయణ, సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన అవసరం



మెమెంటోలు అందుకున్న విద్యార్థులు

ఆకివీడు: ఎయిడ్స్ వ్యాధి నివారణపై విద్యార్థులు అవగాహన పొంది వారి కుటుంబం, స్నేహితులు, సమాజానికి తెలియజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పిలుపునిచ్చారు. ఎయిడ్స్ అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం మండలంలోని దుంపగడపలో వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల్లో కళాశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, పోటీలు, అంశాలపై చైతన్యవంతులైన విద్యార్థులు ఆయా విషయాలను సమాజానికి తెలియజేసి ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. పోటీల్లో విజేతలకు మెమోంటోలను ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ సమన్వయకర్త డాక్టర్ టి.ఓగేశ్వర రావు, కె.శామ్యూల్, డాక్టర్ ఇందిర, జి.సంజీవరాజు, యు.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం

మొగల్తూరు: గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించినా కూటమి నాయకులు యధేచ్ఛగా షాపులు ఏర్పాటు చేసుకుని దర్జాగా అమ్ముకుంటున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను పాటించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో మూడు నిబ్బులు ఆరు పుల్లులుగా వ్యాపారం సాగుతుంది.